కథా నిలయం
8658
శ్రీకాకుళం

# పాల గ్లాసు

"మమ్మీ.... నీకో గుడ్ న్యూస్" పరుగెత్తుకుంటూ లోపలకొచ్చాడు పదో క్లాసు చదువుతున్న నవీన్.

"పరుగుల పందెంలో బహుమతి గెల్చుకొచ్చావా" లలితమ్మ ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ అంది.

"నీ అదృష్టం అది."

"అదృష్టమా!" చేతులు చీరకొంగుకి తుడుచుకుంటూ అంది లలితమ్మ.

"అటు చూడు.... అటు అటు...." గుమ్మంవైపు చూస్తూ అన్నాడు నవీన్.

పొట్టి లంగా, పొడుగు జాకెట్టు, చేతులకి ఎర్రటి గాజులు, మెళ్ళో పూసల గొలుసు, గాజుకున్న పిన్ను నోట్లో పెట్టుకుని పక్కకి చూస్తూ నిలబడింది పదమూడేళ్ళ అమ్మాయి.

"ఈ అమ్మాయి నా ఫ్రెండు" చెప్పుకుపోతున్నాడు నవీన్.

ఉలిక్కిపడింది లలితమ్మ. "నీ ఫ్రెండా!?" అంది ఆ పిల్లవంక చూస్తూ.

"విను.... నా ఫ్రెండు రామం ఇంట్లో పనిచేస్తోంది. నెలరోజులుగా పనిమనిషిలేక బాధపడిపోతున్నావుగా. అందుకని" ఆ పిల్లవంక చూస్తూ అన్నాడు నవీన్.

లలితమ్మకి విషయం అర్థమయిపోయింది.

ఇంట్లో పనిమనిషి లేకపోతే ఎంత ఇబ్బందో అందరికీ తెలిసిన విషయమే. పొద్దున లేచిన దగ్గర నుంచీ అన్ని పనులు చేసుకోలేక ఇంట్లో అందరిపైన విసుక్కుంటుంది లలితమ్మ.

"అలా శేషతల్పంపైన విష్ణుమూర్తిలా పవళించకపోతే మీ స్నేహితుడికి ఫోన్ చేసి వాళ్ళ పనిమనిషిని మనింట్లోకూడా చేస్తుందేమోనని అడగమనరాదా! అసలు మీకేమి పట్టిందిలెండి. నా గొంతునొప్పి అంతే" లలితమ్మ విసుగుతోనే గదులన్నీ శుభ్రంగా తుడిచింది.

"ఇదిగో, ఈ యాష్ట్రే దులిపియ్యి" భర్త పుస్తకంలోంచి తల ఎత్తకుండానే అన్నాడు. లలితమ్మ గట్టిగా తలుపుతోసి వెళ్ళిపోయింది.

టివిలో సినిమా చూస్తున్న నవీన్‌ని చూస్తే ఒళ్ళు మండిపోయింది.

"ఆ రోడ్డుమీద నిలబడి పనిపిల్ల ఎవరైనా కనిపిస్తుందేమో చూడరాదురా!"

"మమ్మీ పనిమినిషిని ఎలా గుర్తుపడతాను?"

"ఎలాగేమిటి! ఆ.... సాధారణంగా చేతిలో బుట్ట, మూత పెట్టిన గిన్నె, ఇంకా... మరి ఇలాగే గుర్తుపట్టటం.... అయినా నువ్వేలా కుదురుస్తావులే పనిపిల్లని...." లలితమ్మ గ్లాసులన్నీ కడిగి లోపల పెట్టింది.

నవీన్‌కి తల్లిని చూస్తే జాలేసింది. ఇంట్లో పనులన్నీ ఒక్కర్తీ చేసుకోలేక కష్టపడిపోతోంది. కాని తనేం చేస్తాడు!!

"మమ్మీ ఇవాల్టినుంచి నా కంచం నేనే కడుక్కుంటాను. నా బట్టలు నేనే ఉతుక్కుంటాను. ఇంకా, నా గది నేనే ఊడ్చుకుంటా, నీకు కొంచెం పని తగ్గినట్లేగా!"

ఆరోజునుంచీ ఎలాగైనా పనిమనిషిని కుదిర్చి తల్లికి విశ్రాంతి ఇవ్వాలని పట్టుబట్టాడు నవీన్. చివరికి ఓ పిల్లని పనికి కుదిర్చాడు.

"పనిపిల్ల దొరకడం మహా అదృష్టం" అంటుంది లలితమ్మ అందరితో.

"నీ పేరేమిటి?" లలితమ్మ ఆ పిల్లవంక చూసింది.

ఎర్రటి రిబ్బన్ కట్టిన జడ ముందుకేసుకుంటూ "సర్ప" అంది.

"ఆ.... ఏమిటి?" లలితమ్మ రెట్టించింది.

"పాము...." నవీన్ నవ్వాడు.

"రాణి అని పిలుస్తారంతా" అంది నవీన్‌వైపు చూస్తూ.

రాణి చాలా చురుగ్గా వుంది. పనులు గబగబా చేసేసుకుని వీధి గేటు దగ్గరగా వేసి వెళ్ళిపోతుంది త్వరత్వరగా. రాణి వచ్చాక లలితమ్మ ప్రాణం హాయిగా వుంది. విశ్రాంతి దొరికింది. దొడ్లో పూసే జాజిపూలు కోసి దండ కట్టడానికి తీరిక దొరికింది.

రెండు రోజులనుంచి చూస్తోంది చెత్తబుట్టలో మిలమిలా మెరుస్తూ తెల్లటి అన్నం. రెండు రోజుల నుంచి చూస్తోంది గ్లాసులో పోసిన టీ చల్లారిపోయి అక్కడే ఉండటం.

పచ్చని గాజులు, పచ్చని బొట్టు, ఎర్ర పరికిణీ కట్టుకుని గబగబా పనికొచ్చింది రాణి. చెప్పులు చెట్టుకింద విడిచింది.

"ఏమే.... అన్నం అలా బుట్టలో పారేశావు.... ఎంత ఖరీదయిన బియ్యమో తెలుసా?"

"ఆ.... అదా అండి..." చీపురు చేత్తో పట్టుకుని పక్క పిన్ను నోట్లో పెట్టుకుంటూ అంది రాణి.

"అంటే....!?" లలితమ్మకి ఒళ్ళుమండిపోయింది.

"మిగిలిన కూరలు, అన్నాలు పెడితే నేను తీసికెళ్ళనండి. బుట్టలో పారేస్తాను. మా అక్క కూడా అంతే. మేం తీసుకెళ్ళం" కళ్ళాపి చల్లుతుంటే నీళ్ళొచ్చి లలితమ్మ మీద పడ్డాయి.

లలితమ్మ ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. మిగిలితే యిచ్చిన అన్నం పనిమనిషి తీసుకోదా....ఏం కలికాలం!!

రెండు రోజులు తెల్లారే సరికి వచ్చిన రాణి ఆరోజు ఎనిమిది దాటినా రాలేదు. లలితమ్మ గుండెల్లో రాయి పడింది. వీధి గుమ్మంలో ముగ్గు వేయాలి. ముందు అనుకుంటూ ముగ్గుడబ్బా పట్టుకు లేచింది.

"ఇటియ్యండి....నేనూ, మా అక్కా రాత్రి సినిమాకెళ్ళామండి. పొద్దున్నే లేవలేకపోయా. ఒకటే నిద్ర" లలితమ్మ చేతిలో ముగ్గుడబ్బా అందుకుంది రాణి.

పని పూర్తయ్యాక గుమ్మంలో నుంచుంది.

"టీ తాగూ" లలితమ్మ రాణికేసి పరీక్షగా చూస్తూ అంది.

"డాక్టరుబాబు పాలు తాగమన్నారండి" రాణి అక్కడే నిలబడింది.

లలితమ్మకి ఇది మరో ఆశ్చర్యం! లలితమ్మ వంటింట్లో పనిలో మునిగిపోయింది.

"మీ అమ్మ పనిమనిషి రాలేదన్న కోపం మనమీద చూపించేది ఇంతవరకు. ఈమధ్య వంట బాగా చేస్తోంది కదురా నవీన్. కూర తిను ఎంత బాగుందో" డైనింగ్ టేబులు దగ్గర భోజనాలు చేస్తుంటే శేఖరం అన్నాడు.

"ఈ చిత్రం విన్నారా మిమ్మల్నే" శేఖరం గ్లాసులో మంచినీళ్ళు పోస్తోంది లలితమ్మ.

"దాన్ని పాలు తాగమన్నాట్ట."

"ఎవర్ని....ఎవరు?" శేఖరం గ్లాసు కింద పెట్టాడు.

"రాణిని.... డాక్టరు."

"పాలు తాగమన్నాడా?" ఆశ్చర్యంగా అన్నాడు నవీన్.

"ఏం? అంటే అని వుండవచ్చు" శేఖరం కొడుకువంక చూశాడు.

"అంటే? దానికి కూడా ఓ పెద్దగ్లాసుడు పాలు ఇయ్యమంటారా?" లలితమ్మ కోపంగా చూసింది ఇద్దరివంకా.

"ఏం....తప్పేముంది?" శేఖరం టవల్‌లో చేతులు తుడుచుకు లేచాడు.

"నవ్వుతారు ఎవరైనా వింటే పనిపిల్లకి పాలు పొయ్యడమా. ఇష్టమైతే టీ తాగమనండి. లేకపోతే ఊరుకోమనండి" లలితమ్మ కోపంగా లేచింది.

నిజంగానే ఆ పిల్లని పాలు తాగమన్నాడేమో. నిజంగానే ఆ పిల్లకి ఏదన్నా జబ్బు వుందేమో.. అయినా ఆ పిల్ల వయసు వాళ్ళంతా పాలు, బోరన్‌విటాలు, హార్లిక్సులు ఎన్నో తాగడం లేదూ, ఐస్‌క్రీములు, జాములు తినడంలేదూ! రోజూ పెద్ద గ్లాసుడు పాలు తనచేత తాగిస్తుంది అమ్మ. ఆ కుక్కకి పళ్ళెం నిండా పాలు పోస్తుంది - నవీన్ భోజనం బల్ల దగ్గర నుంచి కదలలేదు!!

"రేపటి నుంచి రాణికి పాలు పోద్దాం మమ్మీ!"

"ఏమిటీ?" గుడ్లురిమింది లలితమ్మ.

"రేపు లడ్డూలు తింటానంటుంది. ఎల్లుండి ఐస్‌క్రీములు...."

"ఆ.... అలా అనదులే. అంటే చూద్దాం."

నవీన్ కోపంగా వెళ్ళిపోయాడు. అతని మనసులో అదే ఆలోచన. రాణికి పాలు పొయ్యడంలో అంత పెద్ద తప్పేమీ కనిపించలేదు.

లలితమ్మ మనసులో అదే ఆలోచన పనిపిల్లకి పాలు పోయడం ఏమిటి అని!!

రెండు రోజులయింది ... నవీన్ తను తాగే పాలగ్లాసు తల్లి చూడకుండా రాణి చేతికిచ్చాడు.

"ఊ....గటగటా తాగు."

"ఓ బీదపిల్లకి ఓ కప్పు పాలు పోసి పుణ్యం సంపాదించుకో. ఆ కాసిని పాలు పోస్తే మనకేమీ నష్టం రాదు" ఆఫీసుకెళ్తూ శేఖరం అన్నాడు భార్యతో.

ఇంట్లో పనులన్నీ అయిపోయాక ఓ కునుకు తీస్తుంది లలితమ్మ.

కానీ ఎందుకో ఈరోజు నిద్రపట్టలేదు. వీధిలో కేకపెట్టే బిచ్చగాడికి పది పైసలు వేయటానికి తను వెనుకాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం మనసు అంగీకరించడం లేదెందుకో! ఒక్క గ్లాసుడు పాలు పోస్తే పోనీ ఇల్లు నమ్ముకుని పని చేస్తుందేమో....లలితమ్మ మనసుని సమాధాన పరుచుకునే ప్రయత్నం చేస్తోంది.

రాణి పని పూర్తి చేసింది. నవీన్ సందులో గ్లాసు పెట్టాడు. రాణి మూతీ తుడుసుకుంది గుమ్మంలో నిలబడి.

"రాణి....ఈ గ్లాసు తీసుకో" చిన్న గాజు గ్లాసులో పాలు. రాణి అలాగే నిలుచుంది.

"ఊఁ ...తాగు."

ఒక్క నిముషం ఆగి పాలగ్లాసు తీసుకుంది రాణి. గబగబా తాగేసి గ్లాసు కడిగి గుమ్మం పక్కన పెట్టింది. సందులో నుంచున్న నవీన్, గదిలోంచి శేఖరం రాణి మూతి రెండోసారి తుడుచుకోవటం గమనించకపోలేదు.

లలితమ్మకి మళ్ళీ ఎందుకో కోపం వచ్చింది. వీళ్ళిద్దరి మాటలే తనచేత ఈ పని చేయించాయి. ఎదురుగా నిల్చున్న భర్తను చూస్తే కోపం మరీ పెరిగిపోయింది.

"నాలుగు రోజులు పోస్తానంతే" శేఖరం వినేలా అంది.

"నీ యిష్టం. నడుం నొప్పి, గుండెనొప్పి రాకుండా కాపాడుకోవాలో, ఒక్క గ్లాసుడు పాలు పనిపిల్లకు పోయాలో ఆలోచించుకో" శేఖరం నెమ్మదిగా అన్నాడు.

"నేను మాత్రం మరో పని మనిషిని వెతికి తీసుకురాను. అయినా ఆ పిల్లమీద నీకు జాలిలేదా. పోన్లే... రేపటి నుంచి నేను తాగడం మానేస్తా" నవీన్ పుస్తకంలోంచి తల తీయకుండానే అన్నాడు.

లలితమ్మ మాట్లాడలేదు. ఆ తర్వాత ఆ విషయం ఎవరూ మాట్లాడలేదు. రెండు గ్లాసులు కడిగి ఒకటి గూట్లో రహస్యంగాను,

ఒకటి వంటింటి గుమ్మంలోను పెడుతోంది రాణి. వాతావరణం ప్రశాంతంగా ఉంది.

రెండు నెలలు గడిచాయి. రాణికి కాస్త బుగ్గలొచ్చి ముఖంలో కొత్త అందం వచ్చింది. లలితమ్మ ముఖం కళకళలాడుతోంది.

మళ్ళీ లలితమ్మ మనసులో ఆలోచన కదిలింది. 'ఇంకా ఆ డాక్టరు పాలు తాగకక్కర్లేదు. టీ తాగమనడా? అడగాలి దాన్ని. అసలు ఆ డాక్టరు ఎడ్రసు కనుక్కోవాలి. దీని జబ్బు తెలుసుకోవాలి!'

గడియారం వంక చూసింది లలితమ్మ. ఎనిమిది గంటలు.

వీధిలోకి చూసింది లలితమ్మ. నెమ్మదిగా వస్తోంది రాణి. ఎర్ర పూల పరికిణీ, ఓణీ, జడలో కనకాంబరాల దండ, ఎర్రని పూసల గొలుసు, ఎర్రని ప్లాస్టిక్ పిన్నులు....

"ఏమే ఇంత ఆలస్యం... అబ్బో, అంతా మాచింగ్ వేసుకున్నావే?" లలితమ్మ టీ తాగుతోంది.

రాణి పని మొదలు పెట్టింది. గబగబా వీధి తుడిచింది. అంట్లు తోమింది. గదులు తుడిచింది.

లలితమ్మ పాలగ్లాసు గుమ్మంలో పెట్టింది.

"ఇంక పనికి రానండి" పాలగ్లాసు కడిగి పెట్టింది రాణి.

"ఎందుకూ?"

"అదేనండి....రేపటినుంచి స్కూలు తెరుస్తారు కదండి" రాణికి ఎంతో సంతోషంగా ఉంది స్కూలు తెరుస్తున్నందుకు.

"అంటే....నీకేమిటే స్కూలు తెరిస్తే" లలితమ్మకు రాణి మాటలు అర్థం కావటం లేదు.

"నేను నాలుగు పాసయ్యానండి. ఐదో తరగతి కొచ్చాను. జవహర్ బడి లేదండి.... ఈ వెనక వీధిలో సందులోనండి. ఆ స్కూలు బాబుకి కూడా తెలుసండి" ఎర్ర రిబ్బను జడకి అల్లుకుంటోంది.

లలితమ్మకి గుండె నొప్పి వచ్చినట్టే అయింది.

అంటే, ఈ సర్వ. అదే... స్వరూపరాణి ఐదో తరగతిలో వచ్చిందా. సెలవలు కదా అని రెండు నెలలు పనిచేసిందా. మరి జబ్బు సంగతేమిటో" లలితమ్మ రాణివంక చూసింది. చేతులకున్న ఎర్రటి మట్టి గాజులు మెరుస్తుంటే లెక్కపెట్టుకుంటోంది.

"మరి నీ జబ్బు సంగతేమిటి. ఆ డాక్టరు నిన్ను పాలు తాగమన్నాడుగా మరి."

"అదా అండీ ... ఊరికే చెప్పానండి" ఈ మాట చెప్పడానికి సిద్ధంగానే ఉంది రాణి.

"అంటే....మరి....డాక్టరూ .."

"మీరు కుక్కకి రోజూ పళ్ళెం నిండా పాలు పొయ్యమని నాకిస్తున్నారు కదండి. నాకేమో పాలంటే చాలా ఇష్టం. నిజంగా మీరు నాకు గ్లాసులో పాలు పోసి యిస్తారనుకోలేదంటీ.... ఊరికే తాగాలనుంది పాలు యివ్వండంటే ఎవరూ యియ్యరు కదా. డాక్టరు అంటే జాలిపడి ఇస్తారని అన్నానండి" రాణి తల వంచుకునే అంది.

"ఏమిటీ....?" ఆశ్చర్యపోయింది లలితమ్మ.

"చారీ అండీ...." రాణి తల వంచుకునే అంది.

"ఇదేమిటీ?"

"అదే ... సారీ.... అబద్ధం చెప్పి గ్లాసుడు పాలు తాగినందుకు అంటోంది. అంతేనా రాణీ?" గలగల నవ్వాడు నవీన్.

"అబద్ధ మెందుకమ్మా.... మీకు తెలియకుండా చినబాబు ఓ గ్లాసుడు పాలు, తెలిసి మీరొక గ్లాసుడు పాలు ఇదిగో రెండు గ్లాసులూ ....టాంక్స్ చినబాబూ" రాణి నవీన్ వైపు చూసి నవ్వింది.

రెండు నెలలనాడు తను ఈ పాల విషయమై చేసిన గోల తల్చుకుంటే సిగ్గనిపించింది లలితమ్మకి. పాపం, అదీ చిన్నపిల్లే. పాలు తాగాలని కోరికే. మరి అలాగేదో చెప్పకపోతే తనుమాత్రం పోసేదా అసలు! నిజమే.... పాపం వాళ్ళ చిన్న కోరికలు ఎలా తీరతాయి!!

రాణి గుమ్మంలో నించుంది.

"ఆ రెండు గ్లాసులూ నీవే తీసికెళ్ళు. ఇదిగో ఒక నాలుగు రోజులాగిరా. ఓ పరికిణీ, జాకెట్టూ కొని పెడతా."

"నాకొద్దు. నాకు స్కూలు యూనిఫామ్ వుంటుందిగా" రాణి మెడలో గొలుసు కొరుకుతోంది.

"ఇదిగో రాణీ నీకు ఎప్పుడైనా పాలు తాగాలనిపిస్తే ఇక్కడికి రా.... హాయిగా తాగి వెకుదువుగాని. అయ్య, చినబాబూ, ఎవరూ నన్నేమీ అనరు. వాళ్ళంటే మాత్రం నాకేమయినా భయమా. వాళ్ళు వద్దన్నా నేను పొయ్యగలను. భగవంతుడింత ఇచ్చాడు. ఓ గ్లాసెడు పాలు నీలాటిదానికి పోస్తే తరిగిపోతుందా...." లలితమ్మ ముందు గొంతు తగ్గించి, తర్వాత గట్టిగా మాట్లాడుతుంటే రాణి గుమ్మంవైపు చూసి నవ్వుతోంది.

"నవ్వుతావేమిటి. నిజంగానే అంటున్నా...." లలితమ్మ గుమ్మం వైపు చూసింది. తండ్రీ, కొడుకూ ముసిముసిగా నవ్వుకుంటున్నారు.

రాణి, గేటుపక్కనున్న మందారపువ్వు తురుముకుంది జడలో. తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.

లలితమ్మకి తన చిన్ననాటి అమ్మమ్మ ఇల్లు గుర్తొచ్చింది. ఆ ఇంట్లో పెద్ద జామచెట్టుంది. తాతగారు రెండు దోరగా వున్న కాయలు దాచేవారు. పిల్లలడిగినా యిచ్చేవారు కారు. అవి ఎవరికోసం.... ఇంట్లో నౌకరు పేరిగాడికి ఇచ్చేవారు.

"అవును ...మీరు చెట్టెక్కి బోల్డు కాయలు కోసుకుంటారు. పాపం, వాడికి ఒక్క కాయ ఇస్తారా....అయినా పండినవి వాడి ఇష్టం లేదుట. అందుకే నేను దాచి వాడికిస్తాను" అనేవారు.

పేరిగాడు ఇంట్లో ఎన్నో పనులు చేసేవాడు. వాడికోసం బిళ్ళలు, బిస్కట్లు రహస్యంగా దాచి పెట్టేవారు తాతగారు. ఆ ఇల్లు, ఆ చెట్టు, పేరిగాడు, తాతగారు .. లలితమ్మ కళ్ళు మూసుకుంది ఏదో ఆలోచిస్తూ.

వారం రోజులు గడిచాయి. ఇంట్లో కొత్త పనిమనిషి వచ్చింది. రాములమ్మ పని పూర్తిచేసి గుమ్మంలో నిల్చుంది.

"ఇదిగో....తాగు." గ్లాసులో పాలు పోసింది లలితమ్మ.

ఆశ్చర్యపోయింది రాములమ్మ ఆ పాలగ్లాసు చూసి.

"నీకే.... తాగు" అంది లలితమ్మ గుమ్మంలోకి నుంచొని.

వీళ్ళు గొప్పోళ్ళు పనిమనిషికి పాలు పోస్తున్నారు. కానీ, కానీ వీళ్ళ యిల్లు మానేసి మరో యింటికి పనికి వెడితే - అప్పుడు - పాపం ఈ అమ్మ మనసు ఎంతో మంచిదిలాగుంది - అయినా - మనసు నొప్పించకుండా ఏదో చెప్పాలి. రాములమ్మ పాలగ్లాసువంక చూస్తోంది అలాగే

"ఊ....తాగు. మొహమాటపడకు."

రాములమ్మ పాలగ్లాసువంకే చూస్తోంది. ఏం చెప్పాలి!?

"అమ్మా ఏమనుకోవద్దు. పాలు నాకు పడవు. డాక్టరుబాబు పాలు తాగద్దు, జీర్ణం అవటం కష్టం అని చెప్పి, టీ తాగమన్నాడమ్మా. అందుకని" రాములమ్మ ఆ పాల గ్లాసువంకే చూస్తూ అంది నెమ్మదిగా.

లలితమ్మ కూడా ఆ పాలగ్లాసువంకే చూస్తూ నిలబడిపోయింది గుమ్మంలో.

* [ఆంధ్రప్రభ, 3-9-1995] *